# పదం దృక్పథం

- వ్యాసాలు

సాయి బ్రహ్మానందం గొర్తి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౨౦




# అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

## వెరతు వెరతు...

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి పేరు వినగానే చప్పున స్ఫురించేవి ఆయన తిరువేంకటేశుని పాదాలపై నుంచిన భక్తి పదాలూ, అలిమేలుమంగా సమేత శ్రీనివాసునిపై వెదజల్లిన శృంగార పదాలూ!

అన్నామాచార్యుడు తొలి వాగ్గేయకారుడే కాదు, జానపదాలకి బ్రహ్మ రథం బట్టి జనపథం వైపు మరలించిన మహా కవి! అన్నమయ్య పదాలలో భక్తి భావం తెలుగు సాహిత్య పరిమళాన్ని ఆవిష్కరించే పారిజాత సుమరజం! అన్నమయ్య భక్తి భావంలో పులకరించినా, శృంగార పదాలలో తడిసినా పదాలలో

కనిపించేది ఒక కవి హృదయ స్పందన,చలించే మనసుపడే వేదన!

ఒక ఆర్ద్రవ భావం కవిని వహిస్తే ఓ రస ఝరిలా హృదయాంతరాళాల్లోంచి ప్రవహించే ఓ సజీవ స్పందనా శిల్పం!

కేవలం శృంగారం, భక్తి తత్వమే కాకుండా, తాను చుట్టూ ఉన్న మనుషులు, వారి మధ్య సంఘటనలపైన కూడా రాసిన అనేక పదాలు ఉన్నాయి. కొన్ని పదాలు విప్లవాత్మకంగా అనిపిస్తాయి కూడా.

దిగువ చూపబడిన ఓ కీర్తన చూస్తే ఓ కవి హృదయవేదన స్పష్టంగా తెలుస్తుంది. ఆ కీర్తన గురించి ప్రస్తావించే ముందు ఏ సందర్భంలో, ఏ సంఘటన

చూస్తే అన్నమయ్య లోని కవి స్పందించాడో తెలుసుకుంటే కీర్తన భావం హృదయాలకి హత్తుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

క్రీ.శ. 1420 సంవత్సరంలో విజయనగరాన్ని విరూపాక్ష చంద్రశేఖర రాయలు పాలించే వాడు.

విరూపాక్ష మహారాజు విలాస పురుషుడు.

ఓ సారి కపిలేశ్వర గజపతి విరుపాక్షునిపై దండెత్తి వచ్చాడు. యుద్ధంలో చచ్చీ చెడీ విజయం సాధించినా అతని పెద్ద కొడుకు రాజశేఖరుని చేతిలో హత్య గావించబడ్డాడు. రాజశేఖరుణ్ణి అతని తమ్ముడు రెండవ విరూపాక్షరాయలు చంపించాడు. కాని అన్నగారిపై హత్యని విజయనగర వాసులు మెచ్చలేదు సరికదా, అతనికి ఎదురు తిరిగారు. ఇదే అదను చూసుకొని అతని దండనాయకుడు సాళువ నరసింహరాజు ప్రజల మద్దత్తు తీసుకొని రాజ్యాన్ని ఆక్రమించుకొన్నాడు. ఈ నరసింహరాయలు అన్నమయ్యని విజయనగరం పిలిచాడు. విజయనగరం లో జరిగే రాజ్యోప విప్లవాలను తెలుసుకొన్నాడు. అక్కడి సామంత రాజుల దౌర్జన్యాలను కొన్ని కళ్ళారా చూసి చలించి పోయాడు. రాజ్యాధికారం కోసం రాజులు తండ్రినీ, అన్నలనీ, తమ్ముళ్ళనీ, ఆఖరికి కొడుకులనీ హత్య చేసే దుర్గతి చూసి హద్దులు దాటిన మానవత్వపు విలువలు వివరించాడు. ఆ బాధనంతా పదాలలో బంధించి గొంతెత్తి విలపించాడు.

వెరతు వెరతు నిండు వేడుకపడ నిట్టి -
కురుచ బుద్ధుల నెట్టు గూడుదనయ్య
||పల్లవి||

దేహమిచ్చిన వాని దివిరి చంపెడివాడు
ద్రోహి గాక నేడు దొరయట
ఆహికముగ నిట్టి అధమ వర్తికి - నే
సాహసమున నెట్టు చాలుదనయ్య
||వెర||

భయోత్పాతకమైన నీచాతి నీచమైన కురుచ బుద్ధులతో నిండిన ఈ సంఘటనలనెలా జీర్ణించుకొనేది? తనువు నిచ్చిన తండ్రిని చంపే వాడిని ద్రోహిగా చూడకుండా దొరలా సింహాసనంపై ఎక్కడం న్యాయామా అంటూ గొంతెత్తి చెప్పాడు.
ఒకరి కాళ్ళ కింద చాపలాగి వారిని చంపే సాహసం అధమ వృత్తి కాక ఏమవుతుంది?
ఇంకా ఈ పదాలు చూడండి.

తోడ బుట్టినవాని దొడరి చంపెడువాడు
చూడ దుష్టుడు గాక సుకృతియట
పాడైనటువంటి పాప బుద్ధులు సేసి
నీడ నిలువ నెట్టు నేరుతునయ్య
||వెర||

తోడ బుట్టిన అన్ననీ, తమ్ముళ్ళనీ చంపే రాజులు దుష్టులు కదా, వారిని దర్శించుకోవడానికి ప్రజలు రావడం ఎంత విడ్డూరం? ఇటువంటి పాప బుద్ధులున్న రాజుల నీడన ఎలా బ్రతికేది?

కొడుకు నున్నతమతి గోరి చంపెడివాడు
కడుబాతకుడు గాక ఘనుడట
కడలేని ఇటువంటి కలుషవర్తికికి నాత్మ
నొడబరపగ నెట్లోపుదునయ్య
||వెర||

పుత్రుల అభివృద్ధి చూసి సంతోషించవలసిన తండ్రే, కొడుకుని చంపితే పాతకుడుగా పరిగణించక, ఘనుడంటూ పొగడడం న్యాయమా? ఇలాంటి కలుషితమైన పని చేయడానికి మనస్సెలా వచ్చింది?

తల్లి జంపెడువాడు తలప దుష్టుడు గాక
యెల్లవారల కెల్ల నెక్కుడట
కల్లరి యనుచు లోకము రోయు పని ఇది
చెల్లబో నే నేమి సేయుదునయ్య

||వెర||

ఇంటి వేలుపు వేంకటేశ్వరు దనవెంట -
వెంట దిప్పెడువాడు విభుడట
దంటనై యాతని దాసానుదాసినై
నొంటి నుండెద నేమి నొల్ల నయ్య

||వెర||

జన్మనిచ్చిన తల్లిని చంపే దుష్టుడిని శిక్షించాల్సిందిపోయి ఘనుడంటూ నెత్తికెక్కించుకోవడం సరియా? దుష్ట కార్యాన్ని ఖండిచాల్సిన ప్రజలే నిమ్మకు నీరెత్తినట్లు నోరు మూసుకుంటే నాలాంటి సామాన్యుడు ఏమి చెయ్యగలడు, వేంకటేశుని పాదాలపై బడి అతనిని శరణు వేడడం తప్ప? అంటూ కన్నీరు కార్చాడు అన్నమయ్య! బాధపడడమే కాదు, తన పదాలలో వారి తప్పుడు పనుల్నీ, దుశ్చర్యల్నీ నిర్మొహమాటంగా, నిర్భీతిగా చెప్ప గలగడం కవి గా అన్నమయ్య సాహసం చేసాడనే చెప్పవచ్చు.

తప్పుని ఖండించడానికి ధైర్యమొక్కటే కాదు లోతైన హృదయమూ, పదునైన భావం ఉంటే చాలంటూ ఈ పదాలు అన్నమయ్యలోని కవితా దృక్పథాన్ని చాటి చెబుతాయి. విప్లవమంటే నెత్తురు కవిత్వం కాదు అన్న ఈ అన్నమయ్య పదాల స్ఫూర్తి రథం, విప్లవ ఉద్యమాలని నిర్వచించే సరికొత్త దృక్పథం అనడంలో సందేహం లేదు.

## ఎక్కువ కులజుడైన

**ప్రతీరోజూ మన ముందు** అనేక సంఘటనలు జరుగుతాయి. మంచివి కావచ్చు . చెడ్డవి కావచ్చు. సంఘటన బట్టి విషయాన్ని బట్టి ఎవరికి తోచిన రీతిలో వారు స్పందించడం మానవ సహజం. మంచి జరిగితే ఆనందం కలుగుతుంది. చెడు జరిగితే బాధ కలుగుతుంది. బాధ సన్నిహితులదైతే మరింత ఎక్కువగా ఉంటుంది. మిగతావారి విషయంలో ఓ నిట్టూర్పుతో సరిపెట్టేసుకుంటాం. ఒక్కో సారి మన కళ్ళముందే అన్యాయం జరుగుతున్నా తప్పని అనలేకపోవచ్చు. మనకెందుకులే తలదించుకొని వెళిపోవడం రోజూ చూస్తూనే ఉంటాం. సామాన్యుల ప్రవర్తనా సరళి ఇలా ఉంటుంది. కానీ కవుల విషయం లో అలా కాదు.

లోతైన భావజాలమే కాదు, కవి హృదయం అతి సున్నితంగా ఉంటుంది. ఒక్కోసారి వజ్రమంత కఠినంగా

స్పందానావేశం హృదయాలను తాకుతుంది. ప్రజలలో చైతన్యాన్ని కలగ జేస్తుంది. విప్లవ భావాలకి అంకురార్పణ జేస్తుంది. ఏ విషయానికైనా సాధారణ ప్రజలకి కలిగే స్పందన కవి హృదయంలో కాస్త ముందుగా ప్రవహిస్తుంది. ప్రవాహానికి వాక్కు వాయువులా తోడైతే వచ్చేది విప్లవ ప్రళయమే! ప్రళయం యొక్క ధాటి ఆయా స్పందనల బట్టి ఉంటుంది. మనముందు మంచి జరిగితే మెచ్చుకోవడానికి ఎంత పెద్ద మనసు కావాలో మన ముందు చెడు కానీ, అన్యాయం కానీ జరిగితే ఖండిచడానికి వెయ్యి రెట్లు ధైర్యం కావాలి. అప్పుడే కవనం విప్లవ జ్వాలలా చరిత్రలో వెలుగుతూ ఉంటుంది. ఆ వెలుగులో నిజమైన కవి అజరామరంగా ప్రకాశిస్తూ ఉంటాడు. ఒక చేత్తో శంఖం, రెండో చేతిలో చక్రం ధరించిన శ్రీ మహావిష్ణు అవతారంలా ఒక పక్క భక్తి భావంతో , రెండో వైపు విప్లవ భావాలతో శంఖ చక్ర ధారి అయిన శ్రీ మహావిష్ణువు అవతారంలా సొబగులందించిన సాహితీ స్థితికారుడు అన్నమయ్య. విప్లవ పదాలతో జన జాగృతిని కలిగించిన మొట్టమొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. తనముందు జరిగిన చెడునీ, అన్యాయాన్నీ ఎన్నడూ సహించలేదు. ప్రజలకీ, ప్రభువులకీ వెరవ లేదు. తప్పుని ఖండిచాడు. అన్యాయాన్ని గొంతెత్తి చాటి చెప్పాడు. అన్యాయం ఏదైనా కావచ్చు, మోసగించడం కానీ, చంపడంకానీ, సాటి వారిపై వివక్షత కానీ, దూషణ కానీ, నిర్భీతిగా నిర్మొహమాటంగా ఎలుగెత్తి చాటిన పద కవితా పితామహుడు అన్నమయ్య. తోటి మనిషిపై వివక్షత చూపుతూ కులాల పేరుతో మనుషుల్ని వేరుచేసే అరాచక వ్యవస్థని ప్రశ్నించిన మొట్టమొదటి విప్లవ కవిగా అన్నమయ్య పేరు చెప్పుకోవచ్చు. కులాన్ని బట్టి, పుట్టుకని బట్టీ కాకుండా, కేవలం సద్గుణ ప్రవర్తన తోనే ఏ వ్యక్తి అయినా గొప్పవాడు అవుతాడని పదిమందికీ చాటి చెప్పాడు. తను అన్నదే అనుసరించాడు. కేవలం కుల వ్యవస్థని ఖండిస్తూ అనేక కీర్తనలు రాసాడు. బహుళ ప్రాచుర్యం పొందిన "తందనానా ఓరే తందనానా భళా" కాకుండా పలు కీర్తనలు విరచించాడు.

పల్లవి: ఎక్కువ కులజుడైన హీన కులజుడైన
నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు.

చరణం: వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించిన సోమయాజి కంటె
యేదియునులేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు.

చరణం: పరమగు వేదాంతపఠన దొరికియు సదా
హరిభక్తి లేని సన్యాసి కంటె
సరవి మాలిన యంత్యజాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకునాతడే ఘనుడు

చరణం: వినియు చదివియును శ్రీ విభుని దాసుడుగాక
తనువు వేపుచునుండు తపసి కంటె
ఎనలేని తిరువేంకటేశు ప్రాసాదాన్న

ననుభవించిన యాతడప్పుడే ఘనుడు.

నిక్కమైన దైవ సాన్నిధ్యం పొందడానికి కావల్సింది కులం కాదు, నిర్మలమైన భక్తి అంటూ చాటి చెప్పాడు. అలాగే తందనానా ఒరే కీర్తనలో నిండారా రాజు నిద్రించు నిద్రయూ ఒకటే, అండనే బంటునిద్ర అదియూ నొకటే, మెండైన బ్రాహ్మణుడూ మెట్టు భూమి ఒకటే, చండాలుడుండేటి సరి భూమి ఒకటే, అంటూ, కులమనే మలినం మనుషలకి కానీ భూమికి కాదు, రాజుకీ, సేవకుడికీ నిద్ర ఒకటే, శరీరమూ ఒకటే అయినప్పుడు అంటరాని ఈ కులాలెందుకంటూ గొంతెత్తి పాడాడు. అలాగే ఇంకో కీర్తనలో హరివిజ్ఞాన దాస్యం ఒక్కటే సుజాతి అని స్పష్టంగా విశదీకరించాడు.

విజాతులన్నియు వృధా వృధా
అజామిళాదులకదియే జాతి

చరణం: జాతి భేదములు శరీర గుణములు
జాతి శరీరము సరి దోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపుదాస్యం బిది యొక్కటె పో సుజాతి
చరణం: హరి ఇందరిలో నంతరాత్ముడిదె
ధరణి జాతిభేదములెంచిన
పరమగు లీ భావ మష్టమదము భవవికారమని మానిరి
ధరణిలోన బరతత్వ జ్ఞానము ధర్మమూలమే సుజాతి

కులభేదాలు, అంటరాని తనం అన్నమయ్య కాలంలో ఎక్కువగానే ఉండేవి. శరీర శుభ్రత ఒక్కటే కాదు, మనస్సు కూడా పరిశుభ్రంగా ఉన్న జాతే సుజాతి. అందరిలోనూ హరి అంతరాత్ముడై ఉన్నాడు. అటువంటప్పుడు అంటరాని వాడంటూ ఎవరూ ఉండరన్న ధర్మ సూత్రాన్ని అతి సున్నితంగా చెప్పాడు. అప్పటి రోజుల్లో ప్రభువులనీ, అధికారులనీ ప్రశ్నించేవారే లేరు. భయంతో నోరు విప్పే వారు కాదు. అలాగే అంటరాని తనం పేరుతో దైవ సాన్నిధ్యానికి దూరంగా ఉంచేవారు. వారుచేసే పని తప్పు అని ఖండించగలవాడే అసలైన ధైర్యశాలి. తనకేమైనా పరవాలేదు, కానీ మన మధ్యలో చెడుని ఖండిచాలన్న ధోరణే విప్లం అంటే! మన శరీరంలో ముల్లు గుచ్చుకుంటే, బాధతో అరుస్తూ ముల్లుని తీసేస్తాం. అలాగే మన మధ్య జరిగే అన్యాయపు ముల్లునీ మాటల ఆయుధంతో పెకలించాలి. అందుకే ప్రతీ కవికీ స్పందనే ఒకటే చాలదు, కవనపు కత్తితో అన్యాయాన్ని వేటు వైసే సాహసమూ కావాలి. ఈ విషయంలో కవులందరికీ అన్నమయ్యే ఆది గురువు.. ప్రతీరోజు అన్నమయ్య కీర్తనలు పాడడమే కాకుండా ఆ మహానుభావుడు వెలిగించిన విప్లవ జ్యోతులు ఆరిపోకుండా నడుచుకోవాలి. ఏ కవికైనా హృదయమూ, స్పందనే కాదు, తన కవనానికి గొంతు విప్పే ధైర్యం కూడా ఉండాలి. అప్పుడే ఆ కవి అజరామరుడై వెలుగొందుతాడు.

# ఛాయాపహారులు

**కవిత్వమనేది ఒక సృజనాత్మకమైన ప్రక్రియ.** నిబద్ధతో కూడిన స్పందనా చైతన్యానికి సృజనాత్మకమైన భావజాలాన్ని అద్ది పాఠకుల హృదయాల్లో కురిపించే అతి సున్నితమైన సృజనా కౌముదే కవిత్వం అంటే! ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచం గుండె లోతుల్లోకి చూస్తూ ప్రపంచం దృష్టిని తనవైపు మరలించేదే కవిత్వం ! అలా చేసినప్పుడే అది సృజనాత్మక కవిత్వం అవుతుంది. ఒకే దృశ్యాన్ని చూసిన ఏ ఇద్దరి స్పందనా ఒకేలా ఉండదో, అలాగే ఏ ఇద్దరి కవుల కవిత్వం ఒకేలా ఉండదు. ఒకవేళ ఒకేలా ఉంటే మొదటవచ్చిన కవిత్వానికి అనుసరణనో లేదా అనుకరణనో, అచ్చు గుద్దు నట్లు మక్కీకి మక్కీ దించేస్తే భావ చౌర్యమనడం కద్దు. మనిషికి విజ్ఞానం పెరిగి వ్యాపార దృక్పథం కూడా అబ్బింది కాబట్టి, నేటి సమాజంలో చట్టాల రూపంగా కూడా వచ్చింది. దాన్నే మనం కాపీ రైటు అంటూ ఉంటాం. అంటే కవిత్వమైనా, కథ అయినా ఒక కవి సృజనలో పుట్టింది కాబట్టి అది ఆ కవి సొంతం. ఎవరైనా అది ఆ కవిగారి అనుమతి లేకుండా ప్రచురించినా, కాపీ కొట్టినా శిక్షార్హులులన్నది కాపీ రైటు చట్ట ఉద్దేశ్యం. ఈ మధ్య సాంకేతిక విజ్ఞానం పెరిగింది కాబట్టి ఎవరైనా ఏదైనా ఒక సంగీతాన్ని కానీ ఒక సినిమాని కానీ కొనుక్కోకుండా కాపీ చేసుకుంటే నేరం అని చదువుతూ ఉంటాం. సినిమావాళ్ళు దీన్నే పైరసీ అంటున్నారు.

ఎవరైనా ఏ సినిమా అయినా వీడియో పైరసీ చేస్తే మాకు తెలియ పరచండి మేం చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అంటూ ప్రకటనలూ చూస్తున్నాం. వాళ్ళు తీసే సినిమా కథలు అన్నీ ఏదో ఒక సినిమా కాపీయే అన్నది వేరే విషయం అనుకోండి. మనం గొంతెత్తి అరిచినా ఎవరూ పట్టించుకోరు. ఇది జగమెరిగిన సత్యం. ఈ చేట భారత ఉపోద్ఘాతం ఎందుకంటే ఈ భావచౌర్యం అన్నది ఈ మధ్యనే కొత్తగా పుట్టిన జాడ్యం కాదు. అన్నమయ్య కాలంలోనూ ఉంది చెప్పడానికే! అన్నమయ్యకి కూడా ఈ భావచోరుల బెడద తప్పలేదు. అంటే దాదాపు నాలుగు వందల ఏళ్ళ క్రితం కూడా కవులూ కవిత్వం వెలుగొందినట్లే అక్కడక్కడ ఈ భావచోరులూ యథాశక్తి పుట్టుకొచ్చారు. కాకపోతే ఒకటే తేడా అప్పుడు కవులూ, కవిత్వం ఎక్కువ ఇప్పుడు కవులనుమించిన సంఖ్యలో భావచోరులెక్కువ అంతే తేడా.

అన్నమయ్య రాసిన పదాలు బహుళ ప్రాచుర్యం పొందిన సమయంలో కొంతమంది అన్నమయ్య ననకరిస్తూ పద కవిత్వం రాయడం మొదలు పెట్టారు. వారి భావచౌర్యం చూసి అన్నమయ్య పని తప్పంటూ ఓ పద కవిత రాసాడు. భావచౌర్యం అని ప్రత్యేకించి పదం వాడలేదు కానీ, ఛాయాపహారులంటూ వాళ్ళదుమ్ము దులిపేలా ఓ పదకవిత రాశాడు.

తన పదకవితలను అనుకరించిన వారిని కటువుగా గర్హించాడు.

వెరులాల మీకు వేడుక గలితేను
అరువంచి తడుకల్లంగ రాదా // పల్లవి //

ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యం గాదు
కుడిచి వేసిన పుల్లె కుడువ గా గాదు
బడి నొకరు చెప్పిన బ్రతి చెప్పబోతేను
ఆడరి శ్రీహరి కది అరుహము గాదు. //వెరు//

కవిత్వం రాయాలన్న వేడుక కలిగితే, నడుంవంచి తడకల్లినట్లుగా కాస్త పర్శ్రమ చేయచ్చు కదా? పక్కవాళ్ళదాన్ని తస్కరించడం ఎందుకు?
ఒకసారి ముడిచిన కవిత్వ కుసుమం ఇంకో సారి ముడువ యోగ్యం కాదంటూ సుతిమెత్తగా మందలించాడు.

గంపెడుముక దినగా నొక్క వరిగింజ
తెంపున గలసితే తెలియ నెట్టువచ్చు
జంపుల బలవరించగ నొక మంచి మాట
ఇంపైతే హరి యందు కిచ్చునా వరము // వెరు //

ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రం
సంకూర్చి చవిగొని చప్పరించనేల
అమరంగ ఛాయాపహారము చేసుక
తమమాటగూర్చితే దైవము నగడా // వెరు //

ఓ ఒకరు తిని ఉమ్మివేసిన దానికి కాస్త ఉప్పు కారం అద్ది చప్పరించడం ఎందుకు? అందుబాటులో ఉందికదా అని చాయాపహారము చేస్తే దైవము మెచ్చునా? అంటూ ఖండించాడు.

చిబికి వేసిన గింజ చేత బట్టనేల
గబుక కెంగిలిబూరె గడుగగ మరియేల
తొబుక కవిత్వాల దోషాల బొరలితే
దిబుకార నవ్వడా దేవుడైనాను // వెరు //

మించు చద్దికూటిమీద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మరి చెప్పనేరక

కంచు బెంచు నొక్కగతి నదికితే ముట్టు

పెంచువలనే చూచు పెరుమాళ్ళు వాని // వె౹రు //

పుచ్చినట్టి పండు బూజి లోననేవుండు
బచ్చనకవితలు బాతిగావు యెందు
ముచ్చు గన్నతల్లి మూల కొదిగినట్లు
మృచ్చిమి నుతులేల మొక్కరే హరికి // వె౹రు //

ఒకరు రాసిన కవిత్వం ఇంకొకరు అపహరించడం, ఒకరు ఎంగిలి చేసిన బూరెను వేరొకరు కడుక్కొని తినడం లాంటిదే అంటూ ఎద్దేవా చేసాడు అన్నమయ్య..తన కవిత్వాన్ని వేరుకరు అపహరిస్తే అన్నమయ్య గుండె ఎంతగా పగిలిందో ఇవి చూస్తేనే అర్థం అవుతోంది.

ఉల్లి దిన్నకోమటూరక వున్నట్టు
జల్లెడ నావాలు జారిపోయినట్టు
కల్లలు జెప్పి యా కథ కుత్తరములీక
మెల్లన ఉండితే ముచ్చునా దైవము? // వె౹రు //

నేతి బీరకాయ నేయి అందు లేదు
రాతివీరునికి బీరము ఇంచుకాలేదు
ఘూత బూరుగుబండు కడుపులోన దూది
ఏతుల నుడుగులు ఎక్కునా హరికి // వె౹రు //

ఇరుగువా రెరుగలు పొరుగువా రెరుగరు
గొరబైన మాటలు గొణుగుచూ నుందురు
పరుల గాదందురు బాతి గారు తాము
విరసులట్టి వారి విడుచు దేవుడు // వె౹రు //

ఎన్నగ శ్రీవేంకటేశు దాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కుల మెచ్చ
నున్నతితో బాడి రొక డెవ్వడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి // వె౹రు //

ఉల్లితిన్న వాసన ఊరికే పోతుందా? ఒకరి కవిత్వం నాది అన్నంతమాత్రాన పదిమందికి తెలియదా? నేతిబీరకాయలో నేయిలేనట్లే ఛాయాపహారుల కవిత్వంలో వారి సొంత సృజన లేదు. ఆ కవిత్వం బూరుగు పండులా ఉంటుంది. పైకి గట్టిగా ఉన్నా లోపలంతా డొల్లతనమే కదా?

సాధారణంగా అన్నమయ్య పదకవితల్లో చరణాలు ఏడు, మహా అయితే ఎనిమిది మించి లేవు. కానీ ఈ పదకవిత మొత్తం పది చరణాలు ఉంది అంటే, ఈ ఛాయాపహారులనండి లేదా భావచౌర్యులనండి అన్నమయ్య హృదయాన్ని ఎంతగా గాయపరిచారో తెలుస్తుంది.

ఎంతో శ్రమించి మథనపడి, భావ సాంద్రత కలిగిన సృజనని ఎవరైనా తస్కరిస్తే కొండల రాయడుకి కూడా కడుపు మడందా? ఆ మంటల వేడి ఛాయాపహారుల ప్రహారీని కూల్చదా? ఒకటి కాదు, రెండు కాదు తన హృదయాన్ని తాకిన ప్రతీ విషయానికీ కవితా రూపంలో స్పందించాడు అన్నమయ్య. అందుకే ఆ మహానుభావుడి సాహిత్యం ఈ రోజు వరకూ అజరామరంగా నిలిచిపోయింది.

## తలవంచని సాహిత్యం

ఏ విద్యా **కుసుమాలకైనా ప్రోత్సాహం,** సరైన అదరణ లభిస్తే దాని పరిమళాలు సర్వ దిశలా వ్యాపిస్తాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా సాహిత్యాన్ని పోషించాడానికి కొండంత భాషాభిమానమేకాదు, లోతైన భావ పరిజ్ఞానం కూడా అవసరం. ముఖ్యంగా పాలించే ప్రభుత్వాలైనా, రాజులైనా ఈ సృజనాత్మకతని ప్రోత్సహిస్తే ఈ సాహితీ మకరందాలు కలకాలం ప్రజలకి అందుతాయి. అందుకేనేమో ఒక కావ్యంలో సృజన గుర్తించలేని ప్రజల చేత నా సాహిత్యాన్ని చెదివించేలా చేయ వద్దని అల్లసాని పెద్దన సరస్వతీ దేవిని వేడు కొన్నాడు. సంగీతమైనా సాహిత్యమైనా ప్రజల మెప్పు ద్వారానే విలసిల్లుతాయి. పాలకులకూడా తమవంతు సాయం అందించాలి. లేకపోతే ప్రపంచంలో ఏ భాషైనా తన మనుగడ, ఉనికిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఒక్కసారి చరిత్ర తట్టి చూస్తే విజయ నగర రాజుల కాలంలో తెలుగు సాహిత్యం వికసించినట్లుగా ఏ రాజుల పరిపాలన లో జరగలేదేమో! క్రీ. శ 1440 ప్రాంతంలో విజయనగరాన్ని సాళువ నరసింహరాయలు పరిపాలించేవాడు. అతను కూడా సాహితీ పిపాసి. అన్నమాచార్య పద సాహిత్యం గురించి విని, విజయ నగరం రమ్మనమని అహ్వానం పంపాడు. అన్నమయ్య కారణాంతరాల వల్ల విజయ నగరం వెళ్ళలేక పోయాడు. నరశింహరాయల విజయ నగరంలో నివాసం ఉన్నా, తరచు పెనుగొండ లో కూడా ఉండేవాడు.

ఒకసారి అన్నమయ్యను పెనుగొండ పిలిపించుకొని పదసాహిత్యం విని మైమరచి పోయాడు. అన్నమయ్యని సత్కరించాడు. కానుకలూ అభరణాలూ అగ్రహారాలూ కానుకగా ఇచ్చాడు. ఒకసారి వేంకట పతి మీద అలకించిన శృంగార కీర్తన విని గర్వాంధుడై వేంకటపతి మీది పదముల వంటి పదములు తనమీద కూడా చెప్పమని అన్నమయ్యని కోరాడు. అది విని అన్నమ య్య హుతాశుడై " హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ నినుగొనియాడగ నేర" దని ఒక పదం చెప్పాడు. తరువాత అన్నమయ్య బందీగా చెరసాల అనుభవించడం అందరికీ తెలుసున్న కథే! హరిని తప్ప

సామాన్య మానవులను స్తుతించనని రెండు మూడు పదాలు రాసాడు. అదే సమయంలో అన్నమయ్య దాదాపు అదే భావం స్ఫురించేలా వేరే కీర్తనలూ రాసాడు.

**తలగరో లోకులు తడవకురో మమ్ము**
**కలిగిన దిదె మా కాపురము** //పల్లవి//

నరహరి కీర్తన నానిన జిహ్వా
ఒరుల నుతింపగ నోపదు జిహ్వా
మురహరుపదముల మ్రొక్కిన్గ్ శిరము
పరుల వందనకు బరగదు శిరము //తల//

శ్రీపతినే పూజించిన కరములు
చోపి యాచనకు జొరవు కరములు
యేపున హరికడ కేగిన కాళ్ళు
పాపుల ఇండ్లకు బారవు కాళ్ళు //తల//

శ్రీవేంకటపతి జింతించు మనసు
దాపతి నితరము దలచదు మనసు
దేవుడతని యాధీనపు తనువు
తేవల నితరాధీనము గాదు //తల//

దేవుడికీ తనకీ మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాన్ని ఒక విడదీయలేని ఆత్మీయతతో పోల్చాడు అన్నమయ్య. ఎల్లవేళలా తననోట హరినామా సంకీర్తన తప్ప వేరుకరి స్తుతి పలకదు. నరహరికీర్తనలతో నానిన నాలుక వేరొకరి భజన చేయలేదు. మొరహరికి మొక్కిన తల ఇతరుల వందనకు తలవంచదు. . శ్రీపతిని మొక్కే ఈ చేతులతో ఇంకొకరి ప్రాపకం కోసం యాచన చేయగలావా? ఏడు కొండలు ఎక్కినా అలవని కాళ్ళు అధముల ఇంటి వైపు అడుగు కూడా వేయలేవు.. ఎల్లవేళా శ్రీవేంకటపతిని తలచే మనసు కానుకల కీ, బెదిరింపులకీ తల వంచదు. అంటూ ధైర్యంగా ఎంతో గుండె నిబ్బరంతో నరసింహ రాయల మాటలు తిరస్కరించి బందీగానే గడిపాడు తప్ప, ఒక్క పదం కూడా పరుల భజనకి వాడలేదు. మనిషి తప్పు చేస్తే భయపడాలి గానీ శిక్షిస్తారనీ భయపడి సరస్వతిని అమ్ముకోవడం సబబా? అని

పాలించే ప్రభువులని ధిక్కరించడం అంత సులువైనది కాదు. అలా చేయాలంటే ఎంతో మనో నిబ్బరంతో కూడిన ధైర్యం కావాలి.

తరువాత అందుకే అన్నమయ్యకి తలవంచాడు నరసింహరాయలు. ఎంతో మంది కవులు ప్రభువులనీ పాలించే దొరలనీ పొగడ్తల సాహిత్యంతో ముంచెత్తిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కేవలం మహారాజుల ప్రీతి పాత్రులవడంకోసం కావ్య స్తుతి చేసిన కవులూ ఉన్నారు. వారందరిలో అన్నమయ్య అజరామరుడు. తెలుగు సాహిత్యంలో భాగవతం రాసిన పోతన కూడా తన సాహిత్యాన్ని వెల కట్టలేనని విలవిల లాడేడు తప్ప, మరణానికి భయపడకుండా శిక్షలకు తలవంచకుండా జీవించారు . అందుకే చరిత్రలో ఓ అన్నమయ్య పేరూ, ఓ పోతనామాత్యుడి గురించీ, ఓ త్యాగయ్య గురించీ ఇప్పటికీ చెప్పుకుంటున్నాం. ముందుతరాలు కూడా చెప్పుకుంటారు. తను నమ్మిన విలువలకోసం నిలబడే ఏ కవి సాహిత్యమైనా కలకాలం నిలుస్తుందనడంలో ఎవ్వరికీ సందేహం ఉండదు., ఉండకూడదు కూడా !

# ఉద్యోగం మానవ లక్షణం

ఈ సృష్టిలో అన్ని జన్మల కన్నా మానవ జన్మ ప్రశస్తమైనది. ఒక రకంగా మనిషి జన్మ చూసి మిగత జంతుజాలం ఈర్ష్య చెందేలా ఉంటుంది. పుట్టిన ప్రతీ ప్రాణీ గిట్టక తప్పదు. కానీ బ్రతికినన్నాళ్ళు మంచిగా జీవించడం, కష్టపడడం ఇవన్నీ మనిషి జీవితానికి సార్థకత కలగ జేస్తాయి. ఇదే గీతాసార పరమార్థం. పుట్టిన ప్రతీ మనిషీ బ్రతకాలి. బ్రతకాలంటే తినాలి. తినాలంటే ఆహారం పండించాలి. పండించాలంటే కష్టపడాలి. ఈ కష్టపడడం యుగ ధర్మాన్ని బట్టి, కాలాన్ని బట్టి రూపాంతరం చెందుతూ వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే కష్టపడడం అంటే పని చేయడమే! కానీ ఈ భూమ్మీద పడ్డ ప్రతి జీవి పని చేయాలన్న సూత్రం ఏమీ లేదు. కొంత మంది పనిజేస్తారు. కొంత మంది ఇంకోళ్ళు పనిజేస్తే వారి మీద బ్రతికేస్తారు. కాలం మారింది. మనిషి అవసరాలూ మారాయి. ఆలోచనలూ మారాయి. పూర్వం మగవాళ్ళు సంపాదిస్తే ఆడవాళ్ళు ఇంటి పట్టునుండి సంసారం నడిపేవారు. అందులోంచి పుట్టిందే "ఉద్యోగం పురుష లక్షణం" అన్న సామెత. ఇప్పుడు వనితలూ ఉద్యోగాలు చేస్తున్నారు. అది వేరే విషయం. ఈ ఉద్యోగం పురుష లక్షణం అన్న సామెత ఎలాపుట్టిందో తెలియదు కానీ, ఈ సామెతకి ముందే అన్నమయ్య "ఉద్యోగం మానవ లక్షణం" అని ఎలుగెత్తి చెప్పాడు. మనిషి అన్నాక కష్టపడాలి సోమరి తనానికి దూరంగా బ్రతకాలి అని ఓ కీర్తనలో చెప్పాడు.

మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు
సహజి వలె నుండేమీ సాధింప లేడు. - పల్లవి -
వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మరచితే సృష్టి చీకటౌ
పొదలి నడిచితేను భూమెల్లా మెట్టి రావచ్చు.
నిదిరించితే గాలము నిముషమై తోచు. - మహి -

ఈ భూమ్మీద పడిన ప్రతీ మనిషీ ఉద్యోగి కావాలట. రోజూ తినడం నిద్రించడం భోగించడం వంటివి చేస్తూ ఏమీ సాధించలేడు. నిజంగా తలుచుకుంటే దేముణ్ణి చూడవచ్చు. అలా కాకుండా సోమరిగా ఉంటే ఈ సృష్టి చీకటిగానే కనిపిస్తుంది. కాస్త ఓపిక తెచ్చుకొని పట్టుదల కి కాళ్ళు జోడిస్తే భూమంతా ప్రదక్షిణం చేసి రావడం ఎంతో సులభం. అలాకాకుండా తినడం నిద్రించడానికే జీవితాన్ని అంకితం ఇస్తే కాలం నిమిషమై పయనిస్తుంది. ఇంతకంటే విశదంగా ఏ కవి చెబుతాడు?

వేడుకతో జదివితే వేద శాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ
కూడక సోమరి యైతే గుణహీనుడౌను. - మహి -

శ్రద్ధతో ఇష్టంగా చదివితే వేద శాస్త్ర సంపన్నుడవ్వవచ్చు. అలా కాదని నిమ్మకుంటే జడ్డిగా తయారవుతారు. దీక్షతో ఓడిపోకుండా తపస్సు చేస్తే ఉన్నతుడవ్వవచ్చు. ఇవేమీ కాక పోతే అటువంటి వ్యక్తి గుణాలకి సోమరి తనం రంగు అంటినట్టే అని తేట తెల్లంగా చెప్పాడు అన్నమయ్య.

మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెరగ కుండితే వీరిడియౌను
శరణంటే శ్రీ వేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండు డౌను. - మహి -

ఈ కీర్తన చదివేక అన్నమయ్య కవితా దృక్పథం ఎంత విశాలమైనదో తెలుస్తుంది. కేవలం శృగారానికి, భక్తికే కాదు, మానవతకీ, మానవీయ విలువలకీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన అర్జవ కవి అన్నమయ్య. ఏ వ్యక్తికైనా నీతులు సూటిగా చెబితే గుచ్చుకుంటాయి. తిరస్కార నొప్పిని కలగ జేస్తాయి. కానీ అన్నమయ్య ఎవ్వరినీ నొప్పించకుండా సమాజ శ్రేయస్సు కోరుతూ నీతులకీ, సూక్తులకీ భక్తి తత్వం అనే సున్నితమైన వస్త్రం చుట్టి మనిషిగా విలువలతో జీవించడమే దైవత్వం అని చెప్పకనే చెప్పాడు. అందుకే అన్నమయ్య సాహిత్యం అజరామరం. సుమారు అయిదు శతాబ్దాలు గడిచినా అన్నమయ్య సాహిత్యంతో ప్రతీ రోజూ మానవాళిని పలకరిస్తూనే ఉంటాడు. వాటికి స్పందించడమే మన కర్తవ్యం!

ఈ నెల మే 2 వ తేదీ అన్నమయ్య జయంతి. అన్నమయ్య జీవితకాలం 95 సంవత్సరాలే అధికమాసాలతో కలుపుకుంటే శతాయుష్కుడు. కానీ అతని సాహిత్యం నిత్య పరిమళ కవితా సుగంధం. ఆఘ్రాణించే మనసుండాలి కానీ అది నిత్య మల్లెలా అంటుకునే ఉంటుంది. ***

# తతిగాని..

ఈ సృష్టిలో  పుట్టిన ప్రతీ ప్రాణీ మరణించక తప్పదు. అ మరణం సహజ మరణంగా ఉండాలి. అంతే కానీ హత్య చేయబడడం వల్లో , ప్రమాదవశానో సంభవిస్తే అది అసహజ మరణం క్రిందే లెక్క కొస్తుంది. ఒక మనిషిని ఇంకొక మనిషి చంపడం అన్నది అమానుషం ! కలసి మెలసి ప్రేమానురాగాలతో జీవించాల్సిన మానవాళి కల్లోలాలు కక్షలతో ఒకరినొకరు చంపుకోవడం ఏ సమాజమూ హర్షించదు. ఈ చంపుకోవడం అనేది, అస్తికోసమో, అధికారంకోసమో, అ-క్రమణ కోసమో అయితే అది పశు ప్రవృత్తి క్రిందకే వస్తుంది. అనాదిగా భారతదేశం అనేక దండయాత్రలకి గురిఅవుతూనే ఉంది. క్రీ. శ. 1450 సంవత్సరంలో బహమనీ సుల్తానులు విజయనగరం పై దండెత్తి వచ్చారు. ఈ దండయాత్రలో పిల్లా జెల్లా అని చూడకుండ కనిపించిన ప్రతీ మనిషినీ చంపి పోగులెట్టారు. ఈ దౌర్జన్య కాండ చూసి రాజులు పోరాడినా అమాయక  ప్రజలూ ఈ ఘాతుకానికి బలి అయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ తురుష్కుల దౌర్జన్యాన్ని కళ్ళారా జూసి చలించిపోయాడు  అన్నమయ్య.. కత్తి పట్టి కదనరంగలోకి దూకక పోయినా తన సంకీర్తనా కవిత్వపు కత్తితో  ఆ అమానుష  చర్యని ఖండించాడు. ఎంతో హృదయవిదారకంగా విలపించాడు. నిస్సహాయుడిగా శ్రీ వేంకటేశుని వేడుకుంటూ అప్పటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా చెబుతూ సంకీర్తన రూపంలో తన గోడు వెళ్ళ బుచ్చుకున్నాడు.

తతిగాని యీా పాటు  దైవమా విచారించవే
కతలాయ జెప్ప నేడు కలికాల మహిమ - పల్లవి -

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె  భూతములు యెట్టు మోచెనో
అటు బాలుల రొదలు అకాశ మొట్టోరిచెనో
కటకటా యిట్లాయ గలికాల మహిమ - తతిగాని -

దేముడా, ఈ సమయంలో యుద్ధం అనే దౌర్జన్యకాండ పాట్లు విచారించవా? ఒక్కో మరణం ఒక కథలాగ చెప్పేలా ఉంది ఈ కలికాలమహిమ అంటూ విలపించాడు. ( తతిగాని అంటే ఈ సమయంలో అని అర్థం )
తెగిన తలలతో మొండెముల బరువుని ఈ భూమి ఎలా భరించిందో ?
పసి పిల్లల అక్రందనలతో దద్దరిల్లిన రోదనలను ఈ అకాశమెట్లా ఓర్చుకుందో? ఎంతటి దారుణం ఈ కలికాల మహిమ అంటూ రోదించాడు. అన్నమయ్య.

అంగలాచే కామినుల యంగ భంగపు దోపు
లింగితాన మింట సూర్యు డెట్టు చూచెనో చూచెనో
పొంగు నానా జాతి చేత భువన మెట్లా నెనో
కంగి లోక మిట్లాయ గలికాల మహిమ - తతిగాని -

అరుదు గోహత్యలు సేయగ దూడ లంగలార్వ
సరి ధర్మ దేవ తెట్టు సమ్మతించెనో
పర ధన చూర కెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెం దణగెనో కలికాల మహిమ - తతిగాని -

పట్టపగలు స్త్రీ లను మానభంగంచేయడం చూస్తూ ఆ సూర్యుడెట్లా భరించాడో? నానా జాతి మనుష్యులచేత నిండి ఈ భూమి కంగి పోయింది కదా అంటూ అప్పుడు జరిగిన సంఘటనలు కళ్ళకు కట్టినట్లు చెప్పాడు. మనుష్యులే కాదు, పశువులూ ఈ దమనకాండలో దహించుకుపోయినవారే! ముఖ్యంగా తల్లి అవుని కళ్ళముందే చంపడం చూసిన దూడల కన్నీరు ధర్మదేవత ఎలా భరించిందో? కనిపించిన ధనం దోచుకుంటున్న వారిని చూసి లక్ష్మి కరుణ ఎందులో అణిగి ఉంది అంటూ తూర్పార బట్టాడు అన్నమయ్య.

దేవాలయాలు నానా దేశములెల్లా జొచ్చి
దేవగానెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత పుట్టదాయె
కావరమే ఘనమాయే కలికాల మహిమ - తతిగాని -

నిరప రాధుల జంపి నెత్తురు వారించగానూ
తెరల కెట్టుండిరో దిక్పాలులు
నిరసవర్తను లుండే విపరీతకాలమున
గరువాలుగపటాలె కలికాల మహిమ - తతిగాని -

ఉపమింజి దంపతులు నొకరొకరిని జూడ
చపల దుఖములతో సమయుగాను
తపములు జపములు ధర్మము లెందణిగెనో
కపురు బాపాలు నిండె గలికాల మహిమ - తతిగాని -

ఆ తురుష్కుల యుద్ధంలో దేవాలయాలూ భూమట్టం గావించబడ్డాయి. శిధిలాల మధ్య దేవతా మూర్తులు కళావిహీనంగా ఉన్నాయి. కరుణ లేని పాలకులకు కండకావరమే గొప్పగా ఉంది అంటూ తన భాధని నిస్సహాయం గా చెప్పాడు. అమాయక ప్రజలనూ చంపుతుంటే చూస్తూ నిరసన, ప్రతిఘటన చూపించని రక్షక భటులు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే కదా? చేసిన తప్పస్సు, జపాలు ధర్మము ఎక్కడ దాక్కొని ఉన్నాయని ప్రశ్నించాడు అన్నమయ్య.

తలలు వట్టేడువగా తల్లులు బిడ్డల వేయు
తలపెట్టుండెనో యంతర్యామికి
మలపి ముక్కులు గోయ మరుడెట్టు వోరిచెనో
కలలే ఘనమాయ గలికాల మహిమ - తతిగాని -

దీనత లోబడి గుండెదిగు లసురుసురులు
వాని నెట్ల లోగోనో వాయుదేముడు
గూను వంజి తల్లి చూడ గొడుకు గుత్తిక గోయ
గాన బడె నింతేసి కలికాల మహిమ - తతిగాని -

పలుమారు నమ్మింజి ప్రాణములు గొనగాను
ఇల దమలో బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుగుదువు
కలుషమే ఘనమాయ గలికాల మహిమ - తతిగాని -

తల్లి కళ్ళముందే బిడ్డల తలనరకడం ఎంతఘోరం? కాళ్ళూ చేతులూ, ముక్కులూ చెవులూ కనిపించిన అవయవాలని నరికి వేయడం ఈ కలికాలపు మహిమలా ఉంది అంటూ తను చూసిన ప్రతీ ఘోరాన్నీ హృదయవిదారకంగా చెప్పాడు. ఇలా అమానుషంగా ప్రతీ మనిషీ ఇంకొకర్ని చంపుకుంటూ పోతే మిగిలే ప్రాణాలు ఏముంటాయో దేముడికి తెలియదా ? అంటూ తన బాధనీ, ఆవేదననీ కవిత్వపు కన్నీరులో చూపించాడు అన్నమయ్య.

ఏ మతమూ మరణాన్ని కోరదు. సహనాన్నీ సహృదయతనే పంచి యిస్తుంది. మతం పేరుతో మనుష్యులని చంపడం అమానుషం !

సహజీవనం ఈ కలికాలంలో మానవాళికి అవసరం!

మరణానికి మతం లేదు కవిత్వానికి కులంలేదు. ఈ సత్యాన్నెరిగి ప్రజలను కవిత్వపు ఉత్తేజాన్ని కలిగించేవాడే నిజమైన కవి. అ కవితాలంకారికులలో అగ్రగణ్యుడు అన్నమయ్య!

# ఐనట్టయ్యాగాక..

ఈ భూమ్మీద పుట్టిన ప్రతీ మనిషికీ కామ క్రోధ మద మాత్సర్యాలు లేకుండా జీవించడం కష్టం! ఈ నాలుగే కాకుండా మనుషులని ఇంకా కొన్ని దుర్గుణాలు కూడా పట్టి పీడిస్తాయి . అవి  అసూయ, ఓర్వలేని తనం! ఈ రెండూ మనిషి ప్రవర్తనని పతనావస్థకి చేరుస్తాయి. అసూయ అయినవారి అంతం చూస్తుంది.

ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతీ మనిషీ ఒకేలా ఉండడు. ఒక్కో మనిషి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కొంతమందికి ప్రత్యేకమైన కళలబ్బుతాయి. ఈ అబ్బిన వాటిల్లోనూ హెచ్చు తగ్గులుంటాయి. కొంతమందికి ఎక్కువ సృజన ఉంటుంది. పక్కవాడిలోని గొప్పతనాన్ని సృజనని గుర్తించడానికి చాలా పెద్ద హృదయం కావాలి. మెచ్చుకోవడానికి మనసు రావలి.

ఒక్కోసారి మనం పక్కవాళ్ళ గొప్పని గుర్తించినా పైకి అనం !

ఏ రకమైన భావన బయటపడకుండా బానే ఉందిలే అని నిట్టూర్చేస్తాం. కొంతమందైతే బాగున్నా బాగోలేదని, కావాలని ఇతరుల మనసుల నొప్పిస్తారు. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచ లక్షణం. ఈ అవలక్షణాన్ని వదిలించుకుంటే మనిషిగా నిజమైన జీవితం గడిపిన వారవుతారు.

క్షణ భంగురమైన ఈ జీవితంలో మంచి మాటలాడడం, ఎవ్వరినీ నొప్పించకుండా బ్రతకడం కష్టం, కానీ అసాధ్యం మాత్రం కాదు. ఇతరుల్లో చెడుని గుర్తించి చెప్పడానికి ఎంత ఎక్కువ ధైర్యం కావాలో వారిలో మంచినీ, సృజననీ మెచ్చుకోవడానికి పదిరెట్ల ధైర్యం కావాలి. ఇటువంటి విషయాన్నే అన్నమయ్య తత్వం కూడా జోడించి అతి సులభంగా చెప్పాడు.

ఆ కాలంలో అన్నమయ్య కవిత్వానికి అందరూ పిలిచి పీట వేయలేదు. కొంతమంది మెచ్చుకుంటే, కొంతమంది వెక్కిరించారు. అన్నమయ్య కవిత్వమూ హేళనికి గురి అయ్యింది. ఈ కీర్తనలూ ఏమంత గొప్పవీ కావు,  పరవాలేదు, బాగానే ఉన్నాయి, చెత్తకవిత్వానికి దగ్గరగా ఉంది లాంటి విమర్శలకీ గురయ్యింది అన్నమయ్య కవిత్వం. లోకో భిన్న రుచి. మన కిష్టమైన పదార్థమైనా, కవిత్వమైనా మన చుట్టూ ఉన్న అందరికీ నచ్చాలని లేదు. కొంతమంది మెచ్చవచ్చు, మరికొంతమంది పెదవి వెరచవచ్చు. ఈ సత్యమెరిగిన వాళ్ళు ఇతరుల మనసు కష్ట పెట్టడానికి సాహసించరు. ఈ జీవితం హరి సంకల్పితం. చేరాతలు తలరాతలూ అన్నీ హరి నిర్దేశకాలే అంటూ అన్నమయ్య తన బాధనీ విచారాన్నీ ఒక మంచి కీర్తనలో వెలిబుచ్చాడు.

*ఐనట్టయ్యీగాక హరి కల్పితములివి*
*మానేటి వేటివో మానని వేవో*                    *-- పల్లవి - -*

కవిత్వపు సొబగులు దిద్ది కీర్తనలు పాడడం అనేది దైవ కృప వలన సంభవించింది. ఈ సృష్టి మొత్తం హరి కల్పితమే కాదు, చేసే ప్రతీ పనీ హరి సంకల్పమే కదా ! అటువంటప్పుడు ఇతరులకు నచ్చలేదని కీర్తనలు వద్దంటే ఎలా? ఏది మానాలో, ఏది మానకూడదో నిర్దేశించడానికి మనమెవ్వరం?

*ఒక్కరు తలచినట్టు ఒకరి తలపు రాదు*
*పక్కన నందరికి బహుభావాలు*
*అక్కట మొదలొకటి అనలు గొనలు వేరు*
*ఎక్కడని తగిలేది ఏమి సేసేది -- ఐన --*

ఒకే వస్తువు వర్ణిస్తూ ఏ ఇద్దరి కవిత్వమూ ఒకేలా ఉండదు. ఎవరి ఆలోచనలు వారివి. ఒకరు భావ ప్రకటన చేసిన రీతిలో ఇంకొకరిది ఉండదు. తుది మొదలు లేని ఈ ఆలోచనలు ఆపడం ఎవరి కి సాధ్యపడేది? ఎవరి కవితా రీతులు వారివి.

*పొరుగువాని చేత ఆపొరుగువాడు మెచ్చడు*
*నరుల కర్మములు నానా విధములు*
*గరిమ నన్న మొక్కటే కడుపుతనవి వేరు*
*కరుణించొనన నేవి కావన నేవి -- ఐన --*

ఎక్కడైనా మంచివిషయం ఉంటే మెచ్చుకోవడం ఉత్తముల లక్షణం. కానీ ఈర్ష్యాసూయాద్వేషాలతో నిండితే ఇతరుల మంచి ఎలా తెలుస్తుంది.పొరుగువాడు చేసే పనిని ఇంకొక పొరుగువాడు మెచ్చడు. ఇది మానవ నైజం. మనం తినే అన్నం ఒకటే అయినా ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా అనుభూతి చెందుతారు. ఒక్కో కడుపుకి ఒక్కో రకంగా - ఆకలి చల్లారుతుంది. ఒకరి అమృతంలా అనిపించిది ఇంకొకరికి కానే కాదు.

*కడగి దర్కిదుని మాట కలవాని కింపుగాదు*
*బెడగు జీవులందు పెక్కు రీతులు*
*కడు శ్రీవేంకటేశు డొక్కడు జగత్తులు వేరు*
*వొడిగట్టుకొనే దేది వొల్లననేదేది -- ఐన --*

పేదవాడి పలుకు పెదవికి చేటు. అవి ఎంత మంచి విషయమైనా అ మాటలు ధనవంతులకింపు గాదు. ఒక వ్యక్తియొక్క జీవన విధానంపై ఒక విషయం పై అభిప్రాయమైనా, సలహా అయినా ఆధారపడి ఉంటుంది. ఈ సృష్టిలో ఒక్కో జీవి ఒక రకంగా ఉంటారు. జీవులు ఎన్నైనా వేరైనా పరమాత్మ ఒక్కడే! అ వేంకటేశ్వరుని పాదారవిందలకి మొక్కడం తప్ప మనం ఏమి చేయగలం. ఏది మనకి ప్రాప్తమో అదే మనదగ్గరుకు చేరుతుంది.

ఈ కీర్తనలో అధ్యాత్మిక తత్వం కనిపించినా, మానవ నైజం ఎలా ఉంటుందన్నది స్పష్టంగా కనిపిస్తుంది. అసూయ తో అవతల వారిలోని గొప్పతనాన్ని గుర్తించడం కూడా గొప్పే! విద్వత్తు లేకపోతే సరే ! ఉన్న వాడిని ఉంది అని ఒప్పుకోవడానికెవరికీ అభ్యతరం ఉండకూడదు అని అన్నమాయ్య తన కవిత్వాన్ని తూలనాడినందరికీ సుతిమెత్తగా చురకలు అంటించి, నచ్చితే మెచ్చండి. నచ్చకపోతే దూరంగా పొండి కానీ దుర్భా ్షలు మాత్రం చేయకండి అని వేంకటేశ్వరుని సన్నిధిలో అందరి తరపునా వేడుకున్నాడు. ***

# తెలుగువాడనైతి

ఏ భాష అయినా కాలాన్ని బట్టి రూపాంతరం చెందుతూ ఉంటుంది.పూర్వం రాజులు పాలించేటప్పుడైతే రాజు ఏ భాషని అధికార భాషగా నిర్దేశిస్తాడో అదే, ప్రజలూ ఇష్టమున్నా, లేకపోయినా మాట్లాడేవారు. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించేటప్పుడు అధికార భాషగా మొదట కన్నడం ఉండేది. తెలుగు భాషమీద మక్కువతో రాయలు తెలుగుని కూడా ప్రజల భాషగా గౌరవించాడు. అది ఎంతవరకూ వెళ్ళిందంటే తెలుగు రాజ భాష గా మారిపోయే స్థితికి వెళ్ళింది. శ్రీ కృష్ణ దేవరాయల తరువాత విజయ నగర ప్రాభవం తగ్గింది. ఆక్రమణలూ, చీలికలూ పెరిగాయి. యుద్ధాలు అనివార్యం అయ్యాయి. బహమనీ సుల్తానుల అక్రమణతో ఉర్దూ భాష ఉత్తర హిందూస్థానం నుండి దక్షిణం వైపుగా మరలింది. రాజులు మారి, రాజ్యాలు కొల్లగొట్టినప్పుడల్లా భాష కూడా మారుతూ వచ్చింది. నరసింహరాయలు పరిపాలించేటప్పుడు గజపతులు విద్యానగరం పై దండెత్తారు. విజయనగరం అక్రమణకి గురి అయ్యింది. గజపతుల భాష ఒడ్డె భాష ! యావత్తు రాజ్య ప్రజలూ తప్పని సరిగా ఒడ్డె భాష మాట్లాడి తీరాలి అని నిర్బధించారు గజపతులు. అంతవరకూ తెలుగు భాషనే తమ భాషగా పరిగణించే ప్రజలు వేరొక కొత్త భాషనేర్చుకోవాల్సి వచ్చింది. అన్నమయ్యా కిది సబబుగా తోచ లేదు. భాషని ప్రజలపై బలవంతంగా రుద్దడం అనేది ఇష్టంలేక ఈ క్రింది కీర్తన చెప్పాడు.

అన్నియు నా యందె కంటి నన్నటివాడా నేనే
మున్నె నా భావముతో ముడిజివేసినది. -- పల్లవి - -

వాడ వాడలా నేనూ నా కీర్తనలూ నిండి ఉన్నామనే భావన ఇంతకుముందు ఉండేది. ఇప్పుడు వొడ్డె భాష వచ్చాక నా భావము తప్పు అని నిరూపించ బడింది అంటూ వాపోయాడు.

చెలగి సంసారమే జింతించి సంసారినైతి
ములిగి ముక్తి దలజి ముక్తుడనైతి
పలు మతాలు దలజి పౌషండ బుద్ధి నైతి
చెలగి శ్రీ పతి దలజి వైష్ణవుడనైతి -- అన్నియు --

యువ్వనంలో వివాహం చేసుకొని సంసారి నయ్యాను. అ తరువాత భక్తి భావం కలిగి ముక్తి వైపు మళ్ళింది మనసు. శ్రీ పతిని తలచి వైష్ణవుడనయ్యాను.

పొసగ పుణ్యం సేసి పుణ్యాత్ముడనైతి
పసల బాపము చేసి పాప కర్ముడనైతి
వెస బ్రహ్మ చారి నైతి యాచారమున
ముసిగి మరొకాచారమున సన్యాసినైతి -- అన్నియు --

పాప పుణ్యాలననుసరించి పాపకర్ముడనయ్యాను. ఒక్కో సారి మంచి చేసి పుణ్యాత్ముడనయ్యాను. ఆచారాలని బట్టి ఒక్కోసారి ఒక్కో రీతిగా మారుతూ వచ్చాను.

నొగి నొడ్డెభాష లాడి వొడ్డెవాడనైతి

తెగి తెలుగాడ నేర్చి తెలుగువాడనైతి
అగడై శ్రీ వేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీ దాసుడనై దాసరి నేనైతి -- అన్నియు --

బలవంతాన ఒడ్డె భాష నేర్చుకుంటూ ఒడ్డె వాడనయ్యాను. తేట తెలుగు అవపోసన బట్టి తెలుగు వాడినయ్యాను. ఇలా రకరకాల మార్పులు చెందుతున్న నేను (అనగా అన్నమయ్య ) అన్నీ విడచి శ్రీ హరి దాసుడనయ్యాను " అంటూ తనకిష్టంలేని పని అంటే ఒడ్డె భాష నేర్చుకోవడానికి మనసు లేదంటూ అక్రోశించాడు.

కానీ నేడు పరిస్థితులు మారాయి. తెలుగు భాష తన స్థానం మెల్ల మెల్లగా కోల్పోతోంది. ప్రపంచీకరణలో స్థానిక భాషల ప్రాపకం తగ్గుతోంది. కానీ ఎంతైనా మాతృభాషని మించిన అమృతం లేదు. అది అస్వాదించాలే కానీ ఎంత తాగినా దాహం తీరని రస గంగ!

అ గంగని ఎండిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ అని చెప్పడానికి అన్నమయ్య కీర్తనలే సాక్షి

****

# యద్భావం

**మనసు** చంచలమైనది. దాన్ని అదుపులో ఉంచుకోవడానికి మనిషి చాలా కష్టపడాలి. ఎంతో ఏకాగ్రతతో యోగ సాధన చేస్తే కాని అది సాధ్యపడదు. మనసు నదుపులో ఉంచుకోవడంకంటే కష్టమైనది ఇంకొకటుంది. అది మనసుని స్వచ్ఛంగా ఉంచుకోవడం. అంటే ఏవిధమైన చెడ్డ అలోచనలు లేకుండా ఎవ్వరినీ దుర్భాషలాడకుండా, ఇతరులని తమ మాటల తోటి చేతల తోటి కష్ట పెట్టకుండా ఉండడం సాధ్యమయ్యే పని కాదు. సాధారణంగా ఇతరుల ప్రవర్తన మాటలు మనకి నచ్చకపోతే ఒక్కోసారి వాళ్ళపై కసురుకుంటాం. లేదా వాళ్ళని నిందిస్తాం. ఒక్కోసారి ఈ కోపం పరాకాష్టకి చేరితే, మరికొంత మంది ఉత్తినే ఎదుటి వారిపై బురద జల్లుతారు. ఇది నేటి ప్రపంచంలో సర్వ సాధారణం. కానీ ఇతరులపై బురద జల్లడం కాని ఇతరుల లోపాల నెత్తిచూపుతూ, రంధ్రాన్వేషణ చేస్తూ వారి వెనుక విమర్శించడం ఇవన్నీ మానవ సహజమైన దుర్గుణాలు. ఒక మనిషి నచ్చకపోతే వారికి దూరంగా బ్రతకొచ్చు. మంచిగా మాట్లాడడం, ఇతరులను కష్టపెట్టకుండా ప్రవరించడం వంటి సుగుణాలు అలవరుచుకోవడం చెప్పేటంత సులభం కాదు. నాలికని అదుపులో ఉంచితే మంచిదే ! కాని నాలుకని ప్రేరేపించే మనసుని నిర్మలంగా ఉంచుకోవడం సద్గుణ శీలుల లక్షణం. అందుకే మన మనసు ఎలావుంటే మన భావాలు అలా ఉంటాయి. మన భావాలు ఎలా ఉంటాయో అలాగే మన మాటలూ, చేతలూ ఉంటాయి. దాన్నే మన వాళ్ళు "యద్భా వం తద్భవతి " అని అతి సరళంగా చెప్పారు. అన్నమయ్యకీ ఇటువంటివి తప్పలేదు.

అన్నమయ్య కీర్తనల ప్రాభవం చూసి కిట్టని వాళ్ళు ఆయనపై బురద జల్లడం, చెడు ప్రచారం చేయడం, పుకార్లు లేవదీయడం మొదలు పెట్టారు. అలాంటి వారినందరినీ సుతిమెత్తగా గర్హించాడు అన్నమయ్య. తనని నిందించారని తనూ వారిలా మారి నిందించలేదు. కానీ అకారణంగా తనని నిందించడాన్ని సుగుణవంతుల లక్షణం అనిపించుకోదు అని మెల్లగా హెచ్చరించాడు. ఒకరకంగా ఇతరులని నిందించడం దైవ దూషణతో సమాన మన్నాడు.

ధరలో "సెద్భావం తద్భవ" తనెగాన
హరిమయమే జగమంతాను. -- పల్లవి ---

మహి నెదుటివారందు మలినము దలచిన
తహ తహ మనసే తా మలినము
వహి నెదిటందు భావనము భావించిన
బహువిధముల దానూ భావనమే -- ధరలో --

ఈ సర్వ జగత్తూ హరిమయమే ! నీలో ఉన్న హరే ఎదుటవారిలోనూ ఉన్నాడు. మలినమైన మనసుతో ఎదుటవారిని దూషించడం తగదు. ఎదుటవారి పైన బురద జల్లడానికి ప్రయత్నిస్తే ఆ బురద ముందు మన చేతికయ్యాకే ఇతరులను చేరుతుంది. అలా కాకుండా ఎదుటవారి గురించి మంచిగా ఆలోచిస్తే మనకు మంచే జరుగుతుంది. ( పై పదంలో భావనము అంటే మంచి లేదా మేలు అని అర్థంగా భావించ వచ్చు )

ఎక్కువ నెదిటి పాపా లెంచి నిందించేటి
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటి పుణ్యాలుగ్గడించి ఘనమంటే
దక్కిన పుణ్యపు జిహ్వ తానూ ఘనమే -- ధరలో --

ఇతరులను నిందించడం అంటే మన నాలికతో వారి తప్పులు శుభ్ర పరచడం లాంటిదే! ఆ రకంగా మనం మన నాలిక మలినం చేసుకున్నట్లే!

సారె శ్రీవేంకటపతి సుగుణము దలచిన
సారపు జీవుడు దాను సగుణమే
నేరుపుల నాతని నిర్గుణము దలచిన
తారతమ్యములు లేని తానూ నిర్గుణమే -- ధరలో --

తారతమ్య బేధాలు లేకుండా ఇతరులను నిందిస్తే అది భగవంతుని దూషించనట్లే అని పలువిధాల వాపోయాడు అన్నమయ్య. పరనింద దైవనిందతో సమానమనే సద్భావనా శీలాన్ని తన పద కవితల్లోనూ అతి మధురంగా, అత్యంత సరళంగా చెప్పాడు అన్నమయ్య. అన్నమయ్య పదకవితల్లో తెలుగు భాషా సౌరభమే కాకుండా సద్భావనా స్రవంతికూడా పుష్కలంగా కనిపిస్తుంది. అన్నమయ్య కవిత్వం చదివితే కవికి సాహిత్యాభిలాషే కాకుండా సామాజిక బాధ్యత కూడా ఉండాలి అన్న విషయం ప్రస్ఫుటంగా తెలుస్తుంది. అటువంటి కవిత్వం ఎప్పుడూ అజరామరంగా నిలుస్తుంది అనడంలో సందేహంలేదు.

***